
సాక్షి
గుంటూరు
సోమవారం, 14, ఏప్రిల్, 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 515.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు నీటిని నిలుపుదల చేశారు.



ఘనంగా జీవధ్వజం ప్రతిష్ట

ముప్పాళ్ల: ముప్పాళ్లలోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీనాగేంద్రస్వామి విగ్రహం, జీవధ్వజం ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.



భక్తజన కోలాహలం

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.

న్యూస్‌రీల్

నేడు పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో నిర్వర్తించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు

గుంటూరు వెస్ట్: స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని డీఆర్ఎం షేక్.ఖాజావలి ఆదివారం తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

తైక్వాండో పోటీల్లో పది మందికి బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి జూనియర్ విభాగ తైక్వాండో పోటీల్లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీకి చెందిన 10 మంది విద్యార్థులకు బంగారు, 12 మందికి వెండి, ఆరుగురికి కాంస్య పతకాలు లభించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను ఈ నెల 2,3 తేదీల్లో తెనాలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించినట్లు చెప్పారు. మే 30 నుంచి జూన్ 3 వరకు ఉత్తరాఖండ్‌లో జరగనున్న నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనున్నట్లు చెప్పారు. వీరిని ఆదివారం అకాడమీలో అభినందించి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



మంగళగిరి: నూతక్కిలో శతాధిక వృద్ధురాలు కన్నుమూశారు. నూతక్కికి చెందిన గోగుల కాశీ అన్నపూర్ణమ్మ(103) శనివారం మరణించారు. ఆమెకు ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. మరణించే వరకు ఆమె ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. అన్ని పనులూ తనే చేసుకునేవారని కుటుంబ సభ్యులు చెప్పారు. రాత్రి భోజనం చేసి పడుకున్నారని, తెల్లవారుజామున కన్నుమూశారని పేర్కొన్నారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారిణి జ్యోతిసురేఖ



విజయవాడస్పోర్ట్స్: ఆర్చరీ ప్రపంచ కప్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర, దేశ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటారని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అమెరికాలో జరిగిన ఆర్చరీ ప్రపంచ్ కప్ స్టేజ్–1 టోర్నీలో పతకం సాధించిన జ్యోతిసురేఖను మంత్రి ఓ ప్రకటనలో అభినందించారు. ఆదివారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగం ఫైనల్స్‌లో గెలిచి బంగారు పతకాన్ని పొందడం గర్వకారణమన్నారు.

ప్రథమంలో అధమం

- కొద్ది రోజుల క్రితం ఆర్టీసీ బస్సు ఢీకొని బుడంపాడు-నారాకోడూరు మధ్యలో ఆటోలో వస్తున్న ముగ్గురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులో ఉన్న కొందరు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. బస్సులో ఉండాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో వస్తువులేమీ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.
- పాతగుంటూరులోని బ్రహ్మనందరెడ్డి స్టేడియం వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆమెకు ప్రథమ చికిత్స చేసి ఉంటే బతికేదేమో.. బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకపోవడంతో అంబులెన్సు వచ్చేలోపే మరణించింది.

(ఈ ఘటనలో ఆర్టీసీ నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి.)

- ఆర్టీసీ బస్సుల్లో ఖాళీగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు
- అలంకారప్రాయంగా పెట్టెలు
- మోటారు వాహన చట్టానికి తూట్లు
- పట్టించుకోని రవాణా అధికారులు



ఆర్టీసీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు లేని దృశ్యం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉండడం లేదు. ఇందుకోసం ఉంచిన బాక్సులు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఎక్కడా మచ్చుకైనా మందులు, వస్తువులు కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో గడువు తీరిన మందులు, మరికొన్నింట్లో ఖాళీ బాక్సులు, ఇంకొన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఇతర వస్తువులు కనిపిస్తున్నాయి. నిధులు లేక ప్రథమ చికిత్స మందులు కొనలేకపోతున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల ఆర్టీసీ అధికారులు ప్రైవేటు ఆస్పత్రులను ప్రాధేయపడి ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందులు ఉంచుతున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన మందులే ఇప్పటికీ ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రథమ చికిత్స బాక్సుల్లో ఇవి ఉండాలి

మోటార్ వాహన చట్టం ప్రకారం.. ప్రథమ చికిత్స బాక్సుల్లో 17 రకాల వరకు వస్తువులు ఉండాలి. ఎలాస్టిక్ బ్యాండేజ్ రోలర్స్ ఐదు, బెటాడిన్ ఆయింట్మెంట్, డెటాల్ లేదా బయోడిన్, స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్, నియోసిన్ పౌడర్ డబ్బా, సర్జికల్ బ్లేడ్, బర్నాల్ ఆయింట్‌మెంట్, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, బ్యాండ్ఎయిడ్ ప్లాస్టర్లు, నైట్రోజన్, హైడ్రోజన్ పెరాక్సైడ్, దూది, స్పిరిట్, పెయిన్ కిల్లర్ మాత్రలు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలకు మాత్రలు ఉండాలి.

రవాణాశాఖ అధికారుల అలసత్వం

ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందులు లేకపోతే బస్సులను సీజ్ చేసే అధికారం ఆర్టీఓ స్థాయి అధికారులకు ఉంటుంది. అయితే రవాణా అధికారులు ఆర్టీసీ బస్సుల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో మొత్తం గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలు ఉన్నాయి. మొత్తం 370 బస్సులు ఉండగా వాటిలో సుమారు 90 బస్సులు హైర్ (అద్దె) బస్సులు ఉన్నాయి. అద్దె బస్సుల్లో కనీసం ఫస్ట్ ఎయిడ్ బాక్సులూ లేని దుస్థితి. అనుమతుల కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లినప్పుడు మాత్రమే అలంకారప్రాయంగా వీటిని ఏర్పాటు చేస్తుంటారు. ఆ తర్వాత కనిపించవు. ప్రతి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిస్పెన్సరీ ఉంది. అవి లేనిచోట జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ప్రథమ చికిత్స బాక్సుల్లో మందులు పెట్టాల్సి వస్తే ఆస్పత్రులకు ఇండెంట్ పెట్టి తీసుకోవచ్చు. అయినా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మోటార్ వాహన చట్టం ఏం చెబుతోంది..!

కేంద్ర మోటారు వాహన చట్టం 1939 ప్రకారం ప్రయాణికుల వాహనాల్లో విధిగా ప్రథమ చికిత్స బాక్సులు ఉండాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. ఈ మేరకు వాహనాల్లో కచ్చితంగా మందులు ఉండాలి. లైసెన్సు పొందే ముందు బస్సు డ్రైవర్, కండక్టర్ తప్పనిసరిగా వారం పాటు ప్రథమ చికిత్స చేయడంపై శిక్షణ పొందాలి. ప్రతి మూడేళ్లకోసారి లైసెన్సును పునరుద్ధరించుకోవాలి. ప్రయాణికులు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉండాలి. అయితే ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

మందులు సమకూర్చేందుకు కృషి



ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నాం. ఒక ప్రైవేట్ ఆస్పత్రి మెడికల్ కిట్‌లను ఇస్తామని హామీ ఇచ్చింది. దాని కోసం యత్నం చేస్తున్నాం. త్వరలోనే అన్ని బస్సుల్లో ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

– ఎం.రవికాంత్, ఆర్ఎం, ఆర్టీసీ, గుంటూరు జిల్లా

పలువురు పోలీసులపై చర్యలు

- గుంటూరు ఎస్‌బీ డీఎస్పీ వీఆర్‌కు
- సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, ఒక హెచ్‌సీ, పలువురు కానిస్టేబుళ్లు సస్పెన్షన్
- మాజీ ఎంపీ మాధవ్ అరెస్ట్ నేపథ్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చర్యలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్):కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ కుట్రలు అమలు చేయలేక పోలీసు శాఖ బెంబేలెత్తుతోంది. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అరెస్ట్ నేపథ్యంలో జరిగిన పరిణామాలలో భాగంగా గుంటూరు జిల్లాకు చెందిన పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందిపై సర్కారు వేటు వేసింది. ఈనెల 9న అసభ్య వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ కుమార్‌పై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, అతని అనుచరులు దాడి చేశారని, పోలీస్ విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదైంది. మాధవ్‌తోపాటు ఐదుగురిని అరెస్ట్ చేశారు. అయితే అరెస్ట్ వ్యవహారంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు రోజు వ్యవధిలోనే డీఎస్పీ స్థాయి అధికారిని వీఆర్‌కు, మిగతా వారిని సస్పెండ్ చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీ బి.సీతారామయ్యను వీఆర్‌కు పంపించారు. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆయనను ఆదేశించారు. పశ్చిమ సబ్ డివిజన్‌లోని అరండల్‌పేట పీఎస్ సీఐ వీరాస్వామి, ఎస్‌ఐలు రామాంజనేయులు (నగరంపాలెం పీఎస్), రాంబాబు (పట్టాభిపురం పీఎస్), ఏఎస్‌ఐలు ఏడుకొండలు, ఆంథోని (అరండల్‌పేట పీఎస్), హెడ్‌కానిస్టేబుల్ రాజేష్ (నగరంపాలెం పీఎస్), కానిస్టేబుళ్లు తులసి నారాయణ, మోషే (పట్టాభిపురం పీఎస్), ప్రేమ్‌కుమార్, వెంకటస్వామి, మహేష్‌రావులను సస్పెండ్ చేశారు.

హోసన్నా.. జయము



మట్టల ఆదివారం పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈతమట్టలతో వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. హోసన్నా జయము.. జయము.. అంటూ లోక రక్షకుడిని కీర్తించారు. భక్తిగీతాలు ఆలపించారు.

ఎయిమ్స్‌లో బైపాస్ సర్జరీలు ప్రారంభం

- 46 విభాగాల్లో అందుబాటులోకి పూర్తిస్థాయి వైద్య సేవలు
- గుండె జబ్బు రోగులకు ఐసీయూ విభాగం ప్రారంభం



ఎయిమ్స్ ఆస్పత్రి భవనం

మంగళగిరి: ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) రోగులకు ఇక నుంచి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించనుంది. గుండె జబ్బుల రోగులకు బైపాస్ సర్జరీలతోపాటు ఐసీయూ విభాగం ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు కొన్ని జబ్బులకు ఓపీడీ సేవలు మాత్రమే ఇక్కడ అదుబాటులో ఉండేవి. అయితే ఇప్పుడు ఇన్‌పేషంట్ సేవలు, అత్యవసర విభాగం, ఐసీయూలను ప్రారంభించారు. తొలిసారిగా శనివారం ఓ రోగికి వైద్యులు బైపాస్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. 2015లో శంకుస్థాపన చేసుకున్న ఎయిమ్స్ 2018లో వైద్య సేవలను ప్రారంభించింది. ప్రస్తుతం 46 విభాగాలలో అన్ని రకాల వైద్య సేవలూ అందిస్తోంది. ఎయిమ్స్ ఆస్పత్రి భవనాలతోపాటు రెసిడెన్సియల్, మెడికల్, నర్సింగ్ కళాశాలల భవనాల నిర్మాణాలను పూర్తి చేసుకుంది. రోజుకు 3వేల నుంచి 3,500 మంది రోగులకు సేవలందిస్తున్న ఎయిమ్స్ ఇప్పటివరకు 22,49,986 లక్షల మంది రోగులకు సేవలందించింది.37,13,713 ల్యాబ్ పరీక్షలు నిర్వహించింది.. ఈ నెలలో ఇప్పటివరకు 38,212 మంది రోగులు ఓపీడీ సేవలందుకోగా మార్చి చివరి వరకు 4,39,933 మంది రోగులకు సేవలందించింది.42,843 మంది ఇన్ పేషంట్ విభాగంలో చికిత్స పొందారు. ఎయిమ్స్‌కు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రోగులు తరలివస్తుండడం గమనార్హం.

విజయవంతంగా బైపాస్ సర్జరీ



తొలిసారిగా చేసిన బైపాస్ సర్జరీ విజయవంతం కావడం సంతోషంగా ఉంది. నేను డైరెక్టర్‌గా పదవి చేపట్టిన కొద్ది కాలంలోనే బైపాస్ సర్జరీ జరగడంతోపాటు ఐసీయూ ప్రారంభించి రోగులకు సేవలందిస్తున్నాము. ఇప్పుడు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి రోగులు ఇక్కడకు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఇకపై మరింత సమర్థంగా వైద్యసేవలు అందిస్తాం.

ప్రొఫెసర్ డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్
ఎయిమ్స్ డైరెక్టర్

తెనాలిలో వడగండ్ల వాన

- గంటపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం
- పలుచోట్ల కూలిన చెట్లు
- పినపాడులో ఎగిరిపోయిన ఇంటిపైకప్పు
- వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్
- రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్లు తొలగింపు





తెనాలిలో కురుస్తున్న వడగండ్ల వాన (ఇన్‌సెట్‌లో) పడిన వడగండ్లు

తెనాలిఅర్బన్/తెనాలిటౌన్ : తెనాలిలో వడగడ్ల వాన కురిసింది. సుమారు గంటపాటు ఈదురుగాలలతో కూడిన వర్షం పడింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. కొద్ది రోజులుగా తెనాలి పట్టణంలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదివారం ఉదయం నుంచి ఉక్కపోత, వేసవి తీవ్రతతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. భారీ వర్షం కురిసింది. వడగండ్లు పడ్డాయి. వీటికి ఈదురుగాలులు తోడవడంతో ప్రజలు ఆందోళన చెందారు. పినపాడు, పాండురంగపేట, మారీసుపేట, చంద్రబాబునాయుడు కాలనీ, చినరావూరు తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. అవి రోడ్లకు అడ్డంగా పడటంతో రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రోడ్లకు అడ్డంగా కూలిన వృక్షాలను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. పినపాడు చెరువు సమీపంలో నివసించే షేక్ నాగూర్‌వలీ రేకుల షెడ్డు పైకప్పు ఎగిరిపోయింది. ముందే ప్రమాదాన్ని గుర్తించిన నాగూర్‌వలీ కుటుంబ సభ్యులు పక్క ఇంటికి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

వర్షానికి పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తీగలు తెగిపడ్డాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. డీఈఈ బోరుగడ్డ ఆశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగపురం: మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. పలు ప్రాంతాల్లో నీరు పొంగిపొర్లింది.



తెనాలిలో చెట్లు విరిగిపడటంతో తెగిపోయిన విద్యుత్ తీగలు, విరిగిన స్తంభం

లోన్ లొటారం

- పైకి మాత్రం ప్రగల్భాలు
- ఉపాధి రుణాలన్నీ కూటమి నేతలకే..!
- గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 6,842 దరఖాస్తులు
- దరఖాస్తుల పరిశీలనకు వచ్చింది 3,491 మందే
- సిఫార్సుల మేరకు రుణాల మంజూరుకు యత్నాలు
- కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సామాన్యులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిర్దేశించిన రుణాల మంజూరు వ్యవహారం పైన పటారం.. లోన లొటారం అన్నట్లుగా మారింది. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన ఈ కార్యక్రమం అభాసుపాలవుతోంది. నిజమైన లబ్ధిదారులకు రుణాలు అందని ద్రాక్షే అన్న ఆవేదన వ్యక్తమవుతోంది. కూటమి నేతలకే రుణాలన్నీ కట్టబెట్టే యత్నం జరుగుతోంది. ఈ రుణాల కోసం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పలు సామాజికవర్గాల నుంచి 6,842 మంది దరఖాస్తు చేసకున్నారు. వీరిలో తూర్పు నియోజకవర్గ పరిధిలో 3141 మంది, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 2,548 మంది, ప్రత్తిపాడు నియోజవర్గ పరిధిలో 1,153 మంది ఉన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ

ఇదిలా ఉంటే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను అధికారులు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించారు. అర్జీదారులెవరికీ సమాచారం ఇవ్వలేదు. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 3న బీఆర్ స్టేడియంలో, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 4న ఎన్టీఆర్ స్టేడియంలో, ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి 7న నవీన స్కూల్‌లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జరిగింది. కనీస సమాచారం లేకపోవడంతో మొత్తం 6,842 మంది దరఖాస్తు చేసుకుంటే పరిశీలన కార్యక్రమానికి 3,491 మంది మాత్రమే హాజరయ్యారు. కూటమి నేతలు మాత్రమే దరఖాస్తుల పరిశీలనకు వెళ్లి నేతల వద్ద నుంచి సిఫార్సులు చేయించుకున్నట్టు సమాచారం. విషయం తెలిసిన అర్జీదారులు ఇప్పుడు నగరపాలక సంస్థకు పోటెత్తుతున్నారు. తమ దరఖాస్తులు పరిశీలించాలంటూ వేడుకుంటున్నారు.

ప్రచారార్భాటం

నిరుద్యోగ యువతకు రుణాల మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారార్భాటం చేసింది. దరఖాస్తు చేసుకోవాలని అధికారులతో పత్రికా ప్రకటనలు ఇప్పించింది. ఇప్పుడు వేల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం తమ పార్టీ వారికే రుణాలు దోచిపెట్టేందుకు కుయుక్తులు పన్నుతోంది.

పెరిగిపోయిన దళారులు

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దోచుకునేందుకు దళారులు బయలుదేరారు. రుణాలు ఇప్పిస్తామంటూ దరఖాస్తుదారుల నుంచి వేలాది రూపాయలు దండుకుంటున్నారు. వార్డు టీడీపీ కార్పొరేటర్ లేదా ప్రెసిడెంట్, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే రుణాలు మంజూరవుతాయని కూటమి నేతలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత ఉన్న అందరికీ రుణాలు మంజూరు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



రుణ దరఖాస్తుల పరిశీలనకు వచ్చిన అర్జీదారులు (ఫైల్)

నేడు పొన్నెకల్లులో అంబేద్కర్ జయంత్యుత్సవం

- పాల్గొననున్న సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్
- అధికారులకు సూచనలు

తాడికొండ: తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాన్ని సోమవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఎస్పీ సతీష్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పొన్నెకల్లు ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహాన్ని ప్రత్యేకంగా రంగులతో అలంకరించారు. ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పారిశుద్ధ్య పనులు, వాహనాల పార్కింగ్, బారికేడ్‌లు, హెలీప్యాడ్, సభావేదిక పలు ప్రాంతాలను పరిశీలించారు. సభకు హాజరయ్యే అందరికీ తాగునీరు, స్నాక్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీఓ నాగసాయి, తాడికొండ, గుంటూరు పశ్చిమ తహసీల్దార్లు మెహర్ కుమార్, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సమతావాణి, ఆర్ఐ హనుమంతరావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సీఎం పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్‌కు విచ్చేసినప్పటి నుంచి సభ అనంతరం తిరిగి వెళ్లే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్ కుమార్ సిబ్బందికి సూచించారు. ఆదివారం పొన్నెకల్లులో సీఎం పర్యటన బందోబస్తుపై సిబ్బందికి విధుల కేటాయింపు అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేటాయించిన ప్రదేశాల్లో భద్రతా బృందాలు విధులు సమర్థంగా నిర్వహించాలన్నారు. తనిఖీలు క్షుణ్ణంగా చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, ఏటీపీ రవికుమార్, సుప్రజ, ఎ.హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, తాడికొండ సీఐ వాసు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

క్లుప్తంగా

చేనేతలకు నిధులు విడుదల చేయాలి



తాడేపల్లి రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత సహకార సంఘాలకు కేటాయించిన రూ.5 కోట్లు విడుదల చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కుంచనపల్లిలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో త్రిఫ్ట్ ఫండ్ కింద చూపించిన రూ.5 కోట్లలో చేనేత కార్మికులకు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా శివదుర్గారావు, సంఘం రాష్ట్ర కార్యదర్శి డోకుపర్తి రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కొతారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో క్షుద్ర పూజల కలకలం

మార్టూరు : మార్టూరులో ఆదివారం ఉదయం క్షుద్ర పూజల ఆనవాళ్లు స్థానికంగా కలకలం రేకెత్తించాయి. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నేతాజీ కాలనీ సమీపంలో ఆదివారం ఉదయం ఈ క్షుద్ర పూజల ఆనవాళ్లను గమనించిన స్థానికులు విలేకరులకు సమాచారం అందించారు. అక్కడ పరిశీలించిన విలేకరులకు ప్రత్యేకంగా కుంకుమ చల్లి దానిపై మహిళకు చెందిన జాకెట్టును పెట్టి ముగ్గు వేసి అందులో నిమ్మకాయలు, సమీపంలో మల్లెపూలు ఉంచి పూజలు చేసినట్లు కనిపించింది. దీని పక్కనే చిన్న సైజు నల్లకోడి పిల్లను కాల్చి దహనం చేసినట్లుగా చిన్న చిన్న ఎముకలతోపాటు కోడి ఈకలు కనిపించటం గమనార్హం. క్షుద్ర పూజలు చేసినట్లు కనిపిస్తున్న ఆనవాళ్లను చూసి స్థానికులు భయాందోళనలు వ్యక్తపరుస్తున్నారు. గత సంవత్సరం ఇదే ప్రాంతంలో నలుగురు కుటుంబ సభ్యులు కలిగిన ఓ కుటుంబానికి చెందిన ఫొటోను కుంకుమలో ఉంచి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లను గుర్తించిన స్థానికులు ఆ సంఘటనను ప్రస్తుతం గుర్తు చేసుకుంటున్నారు. నేతాజీ కాలనీకి సమీపంలో జరుగుతున్న ఈ క్షుద్ర పూజల ప్రయత్నాలను అధికారులు అడ్డుకొనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రవీణ్ పగడాల కేసులో అన్నీ అనుమానాలే

- మళ్లీ దర్యాప్తు కొనసాగించాలి
- కేసు రీ ఓపెన్‌చేయాలి
- లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

తాడేపల్లి రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఐజీ అశోక్‌కుమార్ చేసిన దర్యాప్తుపై అన్నీ అనుమానాలే ఉన్నాయని, కేసును రీ ఓపెన్ చేసి మళ్లీ దర్యాప్తు చేయాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్ పగడాలపై నిందలు వేసేలా ఐజీ అశోక్ కుమార్ దర్యాప్తు కొనసాగిందని విమర్శించారు. మృతిపై అనుమానం ఇప్పటికీ ప్రబలంగా ఉందని వివరించారు. ఘటనా స్థలంలో ప్రవీణ్ మృతదేహం చూసినప్పుడు వెల్లువెత్తిన అనుమానాలు ఒక్కదానికీ పోలీసులు సరైన సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు. ప్రవీణ్ కేసులో వైరలైన సీసీటీవీ ఫుటేజీలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. కీసర టోల్‌గేటు వద్ద జరిగిన ఘటనపై పోలీసులు చెబుతున్న దానికి, వీడియోలో ఉన్నదానికి పొంతన లేదని విజయ్‌కుమార్ పేర్కొన్నారు. విజయవాడలోని అన్ని సీసీ టీవీ ఫుటేజీలు ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. ఓ పోలీస్ అధికారి ప్రవీణ్ మద్యం సేవించలేదని చెప్పినట్లు రిపోర్ట్ అయిందని గుర్తుచేశారు. ఈ కేసుపై నిజ నిర్ధారణ కోసం జాయింట్ యాక్షన్ కమిటీ వేసి ముందుకు వెళతామని తెలియజేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ విషయంలో కమిటీ రిపోర్టు ఏం తేలిందో సర్కారు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ బిల్లులో తాము కొన్ని సవరణలు చెప్పామని చెబుతున్న కూటమి పార్టీలు ఏం సవరణలు చెప్పారో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

చాంపియన్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డు విజేతకు అభినందన



రికార్డు సాధించిన చిన్నారి హరిహిణిని అభినందిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: పిట్ట కొంచెం కూత ఘనం అనే పదానికి నిదర్శనం శ్యామల హరిహిణి అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిన్నారి అభినందన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే జ్ఞాపకశక్తిలో అనితర సాధ్యమైన ఫలితాలు రాబట్టిన చిన్నారి హరిహిణిని అభినందించారు. గణిత శాస్త్రజ్ఞుల పేర్లను, వారు కనిపెట్టిన శాస్త్రాల పేర్లను మొత్తం 45 శాస్త్రాలను కేవలం 1 నిమిషం 19 సెకన్లలో చెప్పి రికార్డు సాధించటం గొప్ప విషయమన్నారు. ఏటుకూరు రోడ్డులోని సూర్యదేవరపేటకు చెందిన మౌనికశ్రీ అకాడమీ డైరెక్టర్ బోడెపూడి రామారావు మాట్లాడుతూ నల్లపాడు గ్రామానికి చెందిన శ్యామల రవికిషోర్‌రెడ్డి, సావిత్రిల కుమార్తె హరిహిణి గత కొంతకాలంగా తమ అకాడమీలో మెమరి ట్రైనర్ బోడెపూడి నాగస్వప్న పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందుతుందన్నారు. ఇటీవల చిన్నారి ప్రదర్శనలకు చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ , మెడల్, ధృవీకరణ పత్రాలను అందజేసిందన్నారు. రికార్డు సాధించిన చిన్నారిని పలువురు అభినందించారు.

పేలిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టైరు

ప్రయాణికులంతా క్షేమం



నీటితో టైరు నుంచి వస్తున్న మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

నరసరావుపేట: ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు టైరు పేలిన ఘటన నరసరావుపేటలో ఆదివారం జరిగింది. ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి ప్రయాణీకులతో నరసరావుపేట బయల్దేరిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆదివారం ఉదయం ఏడుగంటల సమయానికి పట్టణానికి కిలోమీటరు దూరంలోని వినుకొండ రోడ్డులోకి వచ్చేసరికి రెండుటైర్లలో ఒకటి పెద్దశబ్దంతో పేలి మంటలు, పొగ వ్యాపించాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపటంతో ప్రయాణికులంతా బస్సు నుంచి బయటపడ్డారు. రోడ్డుపక్కనే బ్రిక్స్ తయారీ యూనిట్ ఉండడంతో, అక్కడి నీటి పైపు ద్వారా మంటలు వ్యాపించిన టైరును తడిపి మంటలను ఆర్పేశారు. వేసవి కావటంతో రెండుటైర్లు రాపిడికి గురై, వాటిలో ఒకటి పేలి ఈ సంఘటన జరిగిందని ప్రయాణీకులు తెలిపారు. కొందరు ప్రయాణికులు అదేమార్గంలో వస్తున్న ఆటోల ద్వారా పట్టణానికి చేరుకున్నారు.

రాష్ట్రాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడమే పీ–4 లక్ష్యం

- చంద్రబాబు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ధ్వజం



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న నారాయణ తదితరులు

మంగళగిరి: రాష్ట్రాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడమే పీ-4 లక్ష్యమని, దీనివల్ల పేదలకు ఒరిగేదేమీ ఉండదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు..చినకాకానిలో జరుగుతున్న జనసేవాదల్ శిక్షణా తరగతులకు ఆదివారం ఆయన హాజరయ్యారు. చంద్రబాబు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ మతతత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు. వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చిన చంద్రబాబుకు ముస్లింలు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. డిసెంబర్ 26న సీపీఐ శత జయంత్యుత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా రెడ్ షర్ట్ వలంటీర్ల సేవల కోసం దేశవ్యాప్తంగా జనసేవాదళ్ శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంగాల అజయ్‌కుమార్, చిన్నితిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరు ఉపాధ్యాయుడికి అవార్డు ప్రదానం



భట్టిప్రోలు (కొల్లూరు) : కృష్ణా వరదల సమయంలో లంక గ్రామాలలో సేవలు అందించిన మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గుర్రం మురళీ అబ్దుల్ కలాం జాతీయ సేవా రత్న అవార్డును ఆదివారం అందుకున్నారు. చీరాలలో కృతి ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవాన్ని పునస్కరించుకొని నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రెసిడెంట్, ఏపీఎస్ఎస్‌టీఎఫ్ రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడైన మురళీకి రోటరీ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సీఐ సాంబశివరావు, నాగమణి, అమర్నాథ్, వెంకట అశ్వినిలు అవార్డును అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా సోషల్ ఫోరమ్ సభ్యులు నాగిరెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీను, లక్ష్మణ్‌రావు, నాగరాజు మురళీని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురానికి చెందిన సందీప్ (25) పెదపలకలూరు మీదుగా గుంటూరు వెళుతున్నాడు. పెదపలకలూరు శివారుల్లోని జెఎల్‌ఈ సినిమాస్ సమీపంలో ఆటో ఢీకొనటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

కారు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మృతి



ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న ఫార్చ్యూనర్ కారు

తాడికొండ: ప్రమాదవశాత్తు కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టడంతో వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త లంకా సుభానీ మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం దొండపాడు గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన లంకా సుభానీ(38) ఫార్చ్యూనర్ కారులో వెళ్తుండగా దొండపాడు సీడ్ యాక్సిస్ రోడ్డుపై కారు అదుపుతప్పి కాలువలోకి బోల్తా కొట్టింది. ఘటనలో లంకా సుభానీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్ళూరు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సుభానీ అకాల మృతి పట్ల వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుభానీ ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోదండ రామాలయంలో చోరీ

తాళాలు పగులగొట్టి హుండీలో నగదు తస్కరణ



కోదండ రామాలయంలో హుండీలో నగదు చోరీ జరిగిన దృశ్యం

మాచర్ల రూరల్: నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఉండే కోదండ రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, హుండీలో నగదు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలో శ్రీ కోదండ రామాలయంలోని దేవాలయ ప్రాంగణంలో ఉత్తర ద్వారానికి గొలుసులతో తాళం వేసి ఉంటుంది. ఇనుపరాడ్డుతో ఆ తాళం బద్దలు కొట్టిన దొంగలు లోపలికి ప్రవేశించి, హుండీ పగులకొట్టి నగదును దోచుకొని పోయారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు రామారావు ఆదివారం తెల్లవారుజామున నీటి మోటారు వేసేందుకు దేవాలయంలోకి ప్రవేశించి చూడగా, హుండీ తాళాలు పగలకొట్టి కనిపించాయి. ఆయన వెంటనే పట్టణ పోలీసులకు సమాచారమందించారు. సీఐ పచ్చిపాళ్ల ప్రభాకర్‌రావు తమ సిబ్బందితో దేవాలయానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించి పలు వివరాలు సేకరించారు.

గర్భగుడి తలుపు తెరిచేందుకు విఫలయత్నం..

ఇటీవల జరిగిన శ్రీరామనవమి సందర్భంగా రూ. 20లక్షల విలువైన ఆభరణాలు ఆలయంలోని దేవతా మూర్తులకు అలంకరించియున్నాయి. గర్భగుడి తలుపు తీసేందుకు యత్నించిన దుండగుడు విఫలమయ్యాడు. తలుపు తెరుచుకొని ఉంటే ఆభరణాలు కూడా చోరీకి గురయ్యేవి. ఇటీవల కొన్ని రోజుల క్రితం పాత మాచర్లలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలోనూ హుండీని పగులకొట్టి నగదును దొంగిలించిన విషయం విదితమే. ఈ సంఘటనలు మరువకముందే పట్టణ నడిబొడ్డులో వందలాది మంది నిత్యం సంచరించే ప్రధాన రహదారి పక్కనే ఉన్న కోదండ రామాలయంలో చోరీ జరగటంపై స్థానికులు, భక్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై వరుస చోరీల పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక సాహిత్య దృక్పథంతో రచనలు



కె.వి.మేఘనాథరెడ్డికి డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం అందజేత

నగరంపాలెం: వామపక్ష, దళిత, బహుజన సామాజిక సాహిత్య దృక్పథంతో చంద్రశేఖరరావు రచనలు చేశారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుకొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం బ్రాడీపేటలో డాక్టర్ వి.చంద్రశేఖరరావు జయంతి సాహిత్య పురస్కార సభ- 2005 నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన పెనుకొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమ ప్రభావ నేపథ్యంలో ఆ ఉద్యమానికి దోహదం చేసే రచనలు సాగించారన్నారు. చంద్రశేఖరరావు విలక్షణమైన రచనలను కథా సంపాదకులు వాసిరెడ్డి నవీన్ సోదాహరణంగా వివరించారు. సినీ దర్శకులు సి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చంద్రశేఖరరావు గత చరిత్రకు సంబంధించిన ఉద్వేగాలను ద్రశ్యమానం చేశారని అన్నారు. అనంతరం కలుంకూరి గుట్ట కథా సంపుటి రచయిత కె.వి.మేఘనాథరెడ్డికి డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ వి.ప్రసూన అందించారు. కలుంకూరిగుట్ట కథల్లోని వైశిష్ట్యాన్ని విశ్లేషిస్తూ రాయలసీమ ప్రాంత కరువును అద్భుతమైన మాండలికంతో జానపదుల భాషలోని సౌందర్యాన్ని మేఘనాథరెడ్డి చిత్రించారని కందిమళ్ల శివప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కాట్రగడ్డ దయానంద్, పుప్పాల శ్రీరాం, పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, పారా అశోక్, మన్నం సింధుమాధురి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ ప్రభంజనం



ఎస్.సాత్విక, సీనియర్ ఇంటర్, 982 | మల్లవోలు లిఖిత, 494 | ఓకె గీతిక, 494 | మామిడిపాక హరిణి, 494

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అద్భుతమైన విజయాన్ని అందుకున్నారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో మల్లవోలు లిఖిత 500 మార్కులకు 494, ఓకే గీతిక 494, మామిడిపాక హరిణి 494 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా 490కిపైగా సాధించిన విద్యార్థులు 88 మంది, 480కి పైగా సాధించిన వారు 498 మంది, 475కి పైగా సాధించిన వారు 649 మంది ఉన్నట్లు వివరించారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో విద్యార్థిని సముద్రాల సాత్విక 982 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విధంగా 970కి పైగా 71 మంది, 960కి పైగా 141 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

సంప్రదాయ కళలను ఆదరించడం అభినందనీయం

నాటకోత్సవాలు ప్రారంభం



గుమ్మడి గోపాలకృష్ణ, మహమ్మద్ అఫ్మద్ షరీఫ్‌లకు ఆత్మీయ సత్కారం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సంప్రదాయ కళలను ఆదరించడం అభినందనీయమని సినీ నటుడు మాగంటి మురళీమోహన్ అన్నారు. కొరిటిపాడులోని ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్, రీడింగ్ రూమ్ ఆవరణలో ఆదివారం మురళీమోహన్ 52 ఏళ్ల కళారంగ ప్రస్థానం, గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, వైకే.నాగేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు ప్రాంభమయ్యాయి. తొలుత ఉత్సవ కమిటీ చైర్మన్ ఘంటా పున్నారావు, ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు, కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కళాసాధ నిర్వాహకులు బిళ్ళ అశోక్ బృందం మురళీగానంతో వీనుల విందు చేసింది. ముఖ్య అతిథి మురళీమోహన్ మాట్లాడుతూ ఈ సభలో ఉన్న అనేక మందితో మంచి సంబంధబాంధవ్యాలు ఉన్నాయన్నారు. నాటక రంగ అభివృద్ధి కి కృషి చేస్తున్న ఎల్‌వీఆర్ క్లబ్‌ను, కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ కృషిని అభినందించారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, మహమ్మద్ అహ్మద్ షరీఫ్‌లకు మురళీమోహన్ ఆత్మీయ పురస్కారాలు అందించి, సత్కరించారు. కార్యక్రమంలో పెమ్మసాని రవికుమార్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్‌అహ్మద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కొత్త సుబ్రహ్మణ్యం (కుమార్ పంప్స్), సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్, ఎన్టీఆర్ సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటి వైస్ చైర్మన్ కాట్రగడ్డ ప్రసాద్, కళ్ళం సంస్థలు చైర్మన్ కళ్ళం మోహన్‌రెడ్డి, ఎన్టీఆర్ కళాపరిషత్ గుంటూరు గౌరవాధ్యక్షుడు అంబటి మధుమోహన్‌రెడ్డి, ఎన్టీఆర్ కళాపరిషత్ ఒంగోలు అధ్యక్షుడు ఈదర హరిబాబు పాల్గొన్నారు.

26 నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫాదర్లు, శుభోదయ యువజన సంఘం సభ్యులు

రెంటచింతల: మఠంపల్లి శుభవార్త దేవాలయం తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయ భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గాదె పవన్ రెడ్డి, కార్యదర్శి తానం బాలరెడ్డి తెలిపారు. ఆదివారం రెంటచింతలలో వారు రెవ. ఫాదర్ మార్టిన్ పసల, రెవ.ఫాదర్ అల్లం బాలరెడ్డిలతో కలిసి ఎడ్ల బల ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మండల కేంద్రమైన మఠంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఈ ఎడ్ల ప్రదర్శనకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే ఎడ్ల యజమానులకు, రైతు సోదరులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విభాగంలో 10 బహుమతుల చొప్పున 40 మంది రైతులకు మొత్తం రూ. 8.78 లక్షల నగదును అందచేయనున్నట్లు తెలిపారు. శుభోదయ యువజన సంఘం నాయకులు కందుల కిరణ్ కుమార్‌రెడ్డి, సలిబండ్ల రాజేష్‌రెడ్డి, కొమ్మారెడ్డి రంజిత్‌రెడ్డి, గోపు అఖిల్‌రెడ్డి, గాదె మనీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కొండవీడు నాటికల పోటీలు

రెండోరోజు మూడు ప్రదర్శనలు



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

యడ్లపాడు: కొండవీటి కళాపరిషత్ 26వ జాతీయ స్థాయి నాటికల పోటీలు లింగారావుపాలెంలో ఆదివారం కొనసాగాయి. బోయపాలెం శ్రీఅనంతలక్ష్మి నూలుమిల్లు చైర్మన్ సామినేని కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, ఎంపీటీసీ సభ్యుడు తోకల వీరరాఘవయ్య నటరాజపూజతో రెండోరోజు పోటీలను ప్రారంభమయ్యాయి. పోసాని సుబ్బారావు చౌదరి స్మారక వేదికపై మహాకవి కాళిదాసు కళా ప్రాంగణాన మూడు చైతన్య కళారూపాల్ని ప్రదర్శించారు.

సామాన్య మహిళ అసామాన్య పోరాటం 'జనరల్ బోగీలు'

ఖర్చు తక్కువగా ఉండే రైలు ప్రయాణంలో ప్రభుత్వం జనరల్ బోగీల సంఖ్యను తగ్గించడంతో కూర్చేనే ఖాళీలేక కిటికీలపై, టాయిలెట్‌లోనూ కూర్చుని ప్రయాణించే సామాన్యుల అవస్థలకు ప్రతిరూపమే 'జనరల్ బోగీలు' నాటిక. ఒకవేళ రైలు ప్రమాదం జరిగినా, జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి వివరాలు రైల్వేశాఖ వద్ద ఉండవు. దీంతో టిక్కెట్ ఉన్నా గుర్తింపులేని ప్రయాణికుల్లా వారి చరిత్రలు, కుటుంబాల బాధలు గాలిలో కలిసిపోతాయి. ఇలా రైలు ప్రమాదంలో తన కొడుకును కోల్పోయిన సావిత్రమ్మ రైల్వేశాఖ నిర్లక్ష్యంపై ఉత్తరాల పోరాట ఉద్యమానికి శ్రీకారం చుట్టి జనరల్ బోగీల ప్రయాణికుల జనగొంతుక అవుతుంది. శ్రీ సాయి ఆర్ట్స్(కొలకలూరు) వారు ప్రదర్శించిన ఈ నాటికకు పీటీ మాధవ్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

హృదయ వేదికపై నిత్యం కొలువుండే 'అ..సత్యం' నాటిక

మనిషి హృదయం దైవత్వానికీ, రాక్షసత్వానికీ వేదిక. అందులోని స్వార్థం, భయం ప్రతి సత్యానికీ-అసత్యానికీ మూలంగా మారుతాయని సందేశాన్ని అందించే కథనమే ' అ..సత్యం' నాటిక. కనబడేదంతా సత్యం కాదని..కనబడనిదంతా అసత్యం కాదు. ఏ యథార్థమైనా చెడుకు దోహదపడితే అది అసత్యంగా, అబద్ధమైనా మంచికి మార్గం అయితే అది సత్యంగా సందర్భానుసారంగా స్వీకరించాల్సి వస్తుంది. అన్నింటికీ మూలం మనసు.. అందులోని స్వార్థమని సంఘటన ద్వారా చూపిన కథనం ఇది. చైతన్య కళాస్రవంతి (ఉక్కునగరం-విశాఖ) వారు సమర్పించిన ఈ నాటికను పిన్నమనేని మృత్యుంజయరావు రచించగా, పి.బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు.



పరిషత్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరిరావు, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, నంబూరు వీరాంజనేయులు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తికి అద్దంపట్టే '27వ మైలురాయి' నాటిక

న్యాయమంటే కోర్టు తీర్పు కాదని.. అది నైతికత, సమాజం పట్ల బాధ్యత అంటూ న్యాయవాద వృత్తికి అద్దం పట్టే కళారూపమే '27వ మైలురాయి' నాటిక. న్యాయవాదులు న్యాయం కోసం అన్న విషయాన్ని విస్మరించి క్లయింటు వాదులుగా మారొద్దని, 'న్యాయాన్ని వాదించడం' కన్నా 'న్యాయంగా ఉండడం' మిన్న అంటూ 1993లో జరిగిన కొన్ని యధార్థ సంఘటనలతో సందేశాన్ని ఇచ్చే నాటిక. యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్(విజయవాడ) వారు సమర్పించిన ఈ నాటికకు టి.మాధవ్ రచన, ఆర్.వాసుదేవరావు దర్శకత్వం వహించారు.